
సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.80 అడుగులకు చేరింది.



రూ.లక్ష సమర్పణ

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి టి.శ్రీకాంత్, సత్యవాణి దంపతులు (బయ్యనగూడెం) ఆదివారం రూ.1,00,008 విరాళం సమర్పించారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1,00,116 విరాళం



సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఎస్.శ్రీనివాస ఫణి పవన్‌కుమార్ (విజయవాడ) రూ.1,00,116 విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

కాలానికి ఎవ్వరూ అతీతులు కాలేరు

- డాక్టర్ ఉమర్ ఆలీషా
- ఘనంగా ముగిసిన వార్షిక మహాసభలు



మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: కాల పరీక్షలు ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక తత్వాన్ని పెంపొందించుకోవాలని, కాలానికి ఎవ్వరూ అతీతులు కారు, కాలేరని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పీఠం 96వ వార్షిక మహాసభల ముగింపు సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సభలో ఆయన ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. కాలానికి అతీతంగా ప్రయాణించే ఏ జీవీ సృష్టిలో లేదని చెప్పారు. ఆధ్యాత్మికత, తాత్విక జ్ఞాన మార్గాన్ని ఆచరిస్తే సుఖదుఃఖాలను ఒకేలా చూడగలిగే స్థితిని పొందే అవకాశం ఏర్పడుతుందన్నారు. గురువును ఆశ్రయించి, భ్రాంతులను తొలగించుకున్నప్పుడే మనిషి తనలోని పరమాత్మను దర్శించుకోగలుగుతాడని చెప్పారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా పలువురు పేదలకు కుట్టు మెషీన్లు, పక్షులకు ఆహారంగా ఇచ్చే ధాన్యపు కుచ్చులను డాక్టర్ ఉమర్ ఆలీషా పంపిణీ చేశారు. భవిత ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఎన్‌ఆర్‌ఐ సభ్యులు పేరూరి ఉమా అరవింద్, విజయరామ సుబ్బారావు సమకూర్చిన ప్రింటర్‌ను అందజేశారు. పీఠం ఆధ్వర్యాన రూపొందించిన పలు కరదీపికలను, గ్రంథాలను ఆవిష్కరించారు. కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, విశ్వనాథ్, సాహితీవేత్త జానకి రామచౌదరి, కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల బున్ని, ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ అధినేత నారాయణం మురళి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు తదితరులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు



కాకినాడ నుంచి అయోధ్యకు బయలుదేరిన ప్రత్యేక రైలు వద్ద బీజేపీ నాయకులు

కాకినాడ: అయోధ్య రామ మందిరాన్ని దర్శించే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి ఆదివారం సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరింది. ఆ సమయానికి అక్కడకు చేరుకున్న బీజేపీ నేతలు జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ ప్రయాణికులకు వీడ్కోలు పలికారు. ఈ రైలు సామర్లకోట, అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పలాస, ఒడిశా రాష్ట్రం మీదుగా దాదాపు 1,882 కిలోమీటర్లు ప్రయాణించి మంగళవారం ఉదయం 10.35 గంటలకు అయోధ్య ధామ్‌కు చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు 14వ తేదీన అయోధ్యలో బయలుదేరుతుంది. ఈ ప్రత్యేక రైలు ప్రారంభ కార్యక్రమంలో కాకినాడ శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి, ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి గోపీనాథ్, సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, పైడా భవానీ ప్రసాద్, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్, మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ముత్తా నవీన్‌కృష్ణ, కాకినాడ అసెంబ్లీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

లోవకు భక్తుల తాకిడి

తుని రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆదివారం లోవకు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. క్యూలైన్ల ద్వారా సర్వ దర్శనం, ప్రత్యేక దర్శనాల్లో 10 వేల మంది భక్తులు తలుపులమ్మ తల్లిని దర్శించి, పూజలు చేసినట్టు డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,43,250, పూజా టికెట్లకు రూ.1,10,750, కేశఖండన శాలకు రూ.13,200, వాహన పూజలకు రూ.4,250, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.43,150, విరాళాలు రూ.48,407 కలిపి మొత్తం రూ.3,63,007 ఆదాయం సమకూరిందని ఈఓ వివరించారు. పలువురు భక్తులు లోవ ప్రాంగణంలోని చెట్ల కింద, ఘాట్ రోడ్డు దిగువన మామిడి తోటల్లోను వంటలు, భోజనాలు చేశారు.

ఆకుపచ్చని సంతకం

- ఊపందుకున్న సాగు
- జిల్లాలో సాగు లక్ష్యం 2,16,240 ఎకరాలు
- 86 శాతం విస్తీర్ణంలో పైగా వివిధ పంటలు
- 1.30 లక్షల ఎకరాల్లో వరి
- నీటి కొరత లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు



పెరవలి మండలం పిట్టల వేమవరం గ్రామంలో ఏపుగా పెరిగిన వరి పైరు

సాక్షి, రాజమహేంద్రవరం: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ పంట దిగుబడులు దండిగా వచ్చాయి. అన్నదాతల నుంచి కొన్న ప్రతి గింజకూ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. ఫలితంగా ప్రతి రైతు ఇంటా వరి సిరులు కురిశాయి. ఖరీఫ్ అందించిన ఉత్సాహంతో అన్నదాతలు రబీ సాగు చేపట్టారు. వారి రెక్కల కష్టానికి ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. సాగుకు సమృద్ధిగా నీరు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంది. అలాగే, పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) అందుబాటులో ఉంచింది. వీటన్నింటి ఫలితంగా రైతన్నలు ముమ్మరంగా పంటల సాగు చేపట్టారు. పుడమిపై ఆకుపచ్చని సంతకం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా నిర్ణీత లక్ష్యంలో 86 శాతం పైగా విస్తీర్ణంలో వివిధ పంటలను సాగు చేశారు.

వరి సాగు అత్యధికం

ప్రస్తుత రబీలో జిల్లా వ్యాప్తంగా 2,16,240 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. రబీ సాధారణ సాగు విస్తీర్ణం 2,00,950 ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 1,73,105 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. తద్వారా 86 శాతం పైగా లక్ష్యాన్ని సాధించారు. ఇందులో అత్యధికంగా వరి సుమారు 1,30,000 ఎకరాల్లో సాగు చేశారు. కొద్ది రోజుల్లోనే రబీ సాగు లక్ష్యానికి చేరువయ్యే అవకాశముందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. రబీలో వివిధ రకాల విత్తనాలు 28,000 క్వింటాళ్ల మేర అవసరమని గుర్తించగా.. సీజన్ ప్రారంభం నాటికే 80 శాతం విత్తనాలు రైతుల వద్దనే అందుబాటులో ఉన్నాయి. రబీ సాగు జోరుగా జరగడానికి ఇది అనుకూలించింది. మిగిలిన విత్తనాలను కోఆపరేటివ్, లైసెన్స్‌డ్ ప్రైవేట్ సప్లయర్ల నుంచి సేకరించారు.

సాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా..

నీటి కొరత కారణంగా ఏ ఒక్క రైతూ నష్టపోకూడదనే ఆశయంతో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లాలోని పెరవలి, ఉండ్రాజవరం, బిక్కవోలు, నిడదవోలు, అనపర్తి మినహా మిగిలిన ప్రాంతాల్లో సాగునీటి కొరత తలెత్తే అవకాశం లేదు. చెరువులు, బోర్ల ద్వారా 60 శాతం నీటిని సమకూర్చుకునే అవకాశం ఉండటం రైతులకు మేలు చేసే అంశం. మిగిలిన ప్రాంతాల్లో రబీ నీటి కొరతను అధిగమించేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులతో పాటు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని సేకరించి అందిస్తున్నారు.

మేలు చేస్తున్న ఒండ్రు మట్టి

మిచాంగ్ తుపాను ప్రభావంతో తొలినాళ్లలో సాగు పనులు కాస్త నెమ్మదించినా.. తరువాత వేగం పుంజుకున్నాయి. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లోకి కొట్టుకొచ్చిన ఒండ్రు మట్టి పంటకు ఎంతో మేలు చేకూరుస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ మట్టిలో పంటలకు అవసరమైన పోషకాలు అధికంగా ఉండటంతో ఎరువులు, పురుగు మందుల అవసరం కాస్త తగ్గిందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పంట ఆరోగ్యంగా పెరిగేందుకు ఈ ఒండ్రు మట్టి సైతం ఎంతో దోహద పడుతోందని స్పష్టం చేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

రైతులు ఎరువుల అవసరం తగ్గిందని చెబుతున్నప్పటికీ.. పంటల సాగు, అధిక దిగుబడుల్లో వీటి అవసరం ఎంతో ఉంటుంది. ఈ నేపథ్యంలో రబీ సాగు ప్రారంభమయ్యే సమయానికే అధికారులు ముందస్తుగా ఆర్‌బీకేల్లో వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉంచారు. అందుబాటులోనే ఎరువులు ఉండటంతో రైతులకు వ్యయప్రయాసలు తగ్గాయి. రబీలో లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేయగా.. ఇప్పటికే సుమారు 60 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. సాగులోని వివిధ దశల్లో అవసరానికి అనుగుణంగా మిగిలిన ఎరువులను అందుబాటులోకి తీసుకువస్తారు.

ముందస్తుతో మేలు

రబీ పనులు ముందస్తుగా చేపట్టేలా అధికారులు డిసెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకూ రైతులకు అవగాహన కల్పించారు. సింహభాగం సన్నరకాలు సాగు చేయాలని సూచించారు. ఎంటీయూ–1121, (శ్రీధృతి), ఆర్‌ఎన్‌ఆర్–15048, ఆ తరువాత బీపీటీ తదితర రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. దీనివలన 120 నుంచి 130 రోజుల్లో పంట పూర్తవుతుందని, నీటి ఎద్దడిని సైతం ఎదుర్కొనే వెసులుబాటు కలుగుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఫలితంగా రబీ సాగు నిరాటంకంగా సాగుతోంది.

జిల్లాలో పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)

మండలం	సాగు చేసిన పంటలు
అనపర్తి	9,276
బిక్కవోలు	14,173
దేవరపల్లి	11,882
గోకవరం	5,866
నిడదవోలు	16,525
కడియం	5,213
తాళ్లపూడి	8,389
కొవ్వూరు	11,000
సీతానగరం	12,913
రాజానగరం	8,237
గోపాలపురం	13,878
పెరవలి	7,863
ఉండ్రాజవరం	11,572
కోరుకొండ	7,084
చాగల్లు	8,437
నల్లజర్ల	12,940
రాజమహేంద్రవరం రూరల్	3,278
రంగంపేట	4,579

సాగుకు అనుకూల వాతావరణం



రబీలో అనువైన వాతావరణం ఏర్పడటంతో పంటల సాగు జోరుగా జరుగుతోంది. దీనికి తోడు రైతులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా సీజన్‌కు ముందుగానే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. కొద్ది రోజుల్లోనే రబీ సాగు పూర్తి స్థాయిలో జరుగుతుంది. మిచాంగ్ తుపాను కారణంగా పొలాల్లోకి కొట్టుకువచ్చిన ఒండ్రుతో ఎరువుల ఆవశ్యకత ఉండటం లేదు. దీంతో ఎరువులు తీసుకుని వెళ్లేందుకు రైతులు రావడం లేదు.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

రికార్డ్ అసిస్టెంట్ పోస్టులకు 18న రాత పరీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ)లో రెండు రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 18న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి మహిళా కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పోస్టులకు 2019 జూలై 16న నోటిఫికేషన్ జారీ చేశామని, 2020 ఏప్రిల్ 24న జరగాల్సిన రాత పరీక్ష కోవిడ్ కారణంగా వాయిదా పడిందని తెలిపారు. తిరిగి ఈ నెల 18న నిర్వహిస్తున్న దృష్ట్యా, హాల్ టికెట్లను సంబంధిత అభ్యర్థుల చిరునామాలకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించామని పేర్కొన్నారు. కొందరు అభ్యర్థులు.. దరఖాస్తులోని చిరునామాలో లేకపోవడం, ఇతర కారణాల వల్ల హాల్ టికెట్లు డీఎల్ఎస్ఏకు తిరిగి వచ్చాయన్నారు. సంబంధిత అభ్యర్థులు ఈ విషయం గమనించి, వారి హాల్ టికెట్లను రాజమహేంద్రవరంలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో నేరుగా పొందవచ్చని సునీత తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన రత్నగిరి

సత్యదేవుని దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు



అన్నవరం: రత్నగిరి ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి ఆలయానికి పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో రద్దీగా మారాయి. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో మధ్యాహ్నం వరకూ ప్రదక్షిణ దర్శనాలు నిలిపివేశారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు తెలిపారు. వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరింది. ఈ నెల 13 నుంచి ముహూర్తాలు ఉండటంతో సత్యదేవుని సన్నిధిన అధిక సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఆ రెండు రోజులూ కూడా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

- పోలీసులకు ఎస్పీ ఆదేశం
- ఎన్నికల నియమావళిపై వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోలీసులందరూ ఎన్నికల నియమావళి ప్రకారం నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఎలక్షన్స్ ప్రాసెస్–2024 అనే అంశంపై ఐఎంఏ హాలులో ఆదివారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఆ గ్రామ పెద్దలతో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, సారా, మద్యం, నగదు, నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా బోర్డర్ చెక్ పోస్టులను బలోపేతం చేయాలని సూచించారు. పోలీసులందరూ నీతి, నిజాయితీతో, నిస్వార్థంగా కష్టపడి పని చేయాలన్నారు. తటస్థంగా ఉండాలని, ఏ రాజకీయ పార్టీ లేదా అభ్యర్థి పట్ల అభిమానం చూపవద్దని సూచించారు. ఎన్నికల్లో దొంగ ఓటు వేస్తే ఏడాది వరకూ జైలు శిక్ష, జరిమానా విధిస్తారని తెలిపారు. మొదటి అడిషనల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కేసుల నమోదు, వాటిని కోర్టులో పొందుపరచడం తదితర అంశాలను వివరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసు అధికారుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ అంశాలపై ఎన్నికల శిక్షణ పొందిన అధికారులు కూడా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్షన్ సెల్, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంపై బాధ్యత పెంచుకోవాలి

- చదువుతో పాటు ఆటపాటల్లోనూ విద్యార్థులు రాణించాలి
- బాలోత్సవ్ ముగింపు సభలో వక్తలు



అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చిన్న వయస్సు నుంచే విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతను పెంచుకోవాలని, చదువుతో పాటు ఆటపాటలు, తమలో ఉన్న ఇతర ప్రతిభను చాటుకునేందుకు ప్రయత్నించాలని పలువురు వక్తలు సూచించారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న గోదావరి బాలోత్సవం ముగింపు వేడుక ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర పాలక సంస్థ మాజీ కమిషనర్ ఎం.జితేంద్ర మాట్లాడుతూ, మంచి సమాజానికి అవసరమైన మానవ వనరులను అందించేందుకు ఇటువంటి బాలోత్సవాలు ఎంతో అవసరమని అన్నారు. కేవలం ర్యాంకులు, మార్కుల కోసమే అన్నట్లుగా కొనసాగుతున్న ప్రస్తుత విద్యావిధానం వలన దేశానికి ఏమాత్రం ప్రయోజనం లేదని చెప్పారు. రాబోయే కాలంలో ఆక్సిజన్ కొనుగోలు చేయాల్సిన దుస్థితికి సమాజం పతనమవుతుందన్నారు. ప్రతి విద్యార్థీ మొక్కలు నాటడంతో పాటు, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, వారిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. బాలోత్సవ్ కార్యకలాపాలను గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి వివరించారు. ఈ బాలోత్సవంలో సుమారు 5,600 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారని చెప్పారు. ఉత్తమ ప్రతిభను చూపిన వారికి అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, మెడల్స్ అందజేశారు. స్పెల్‌బీ, కార్టూన్లు, చిత్రలేఖనం, వక్తృత్వం, పద్యం భావం, క్విజ్, శాస్త్రీయ నృత్యాలు, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, జానపద గీతాలాపన, కోలాటాలు నిర్వహించారు. మట్టితో బొమ్మలు చేసే విభాగంలో విద్యార్థులు వివిధ కళాఖండాలు తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ప్రముఖ నాట్యాచార్యుడు సప్పా దుర్గాప్రసాద్, వెంకటేశ్వరా ఫైనాన్స్ అధినేత వేణుగోపాల్, ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ ఎస్ఎస్ఎస్ శర్మ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆర్.రామ్మోహనరావు, ప్రముఖ కవి డాక్టర్ అరిపిరాల నారాయణరావు, సంఘ సేవకులు మాటూరి సిద్ధార్థ, కాశీ విశ్వనాథం, సూర్య కృష్ణకుమార్, టి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాన్ని గెలిపించండి

- అబద్ధాన్ని ఓడించండి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణు
- రాజానగరంలో ఆడపడుచుల ఆశీర్వాద సభ
- వేలాదిగా తరలివచ్చిన మహిళలు



సభలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణు. చిత్రంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమెల్సీలు తదితరులు



సభకు తరలివచ్చిన ఆడపడుచులు

రాజానగరం: రాబోయే ఎన్నికలు నిజానికి, అబద్ధానికి మధ్య జరుగుతున్న పోరాటమని, ఇందులో ప్రజలు నిజాన్ని గెలిపించి, అబద్ధాన్ని ఓడించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం రాజానగరంలో నిర్వహించిన ఆడపడుచుల ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని అబద్ధం చేసిన సంగతి ఏ మహిళా మరచిపోరాదని అన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏకంగా రూ.25 వేల కోట్ల డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేసిన సంగతి నిజం కాదా అని ప్రశ్నించారు. దీనిని బట్టి అబద్ధమంటే చంద్రబాబు, నిజమంటే జగన్‌మోహన్‌రెడ్డి అనేది అర్థం చేసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో అబద్ధాలకోరులను అందలం ఎక్కిస్తారో, ఇచ్చిన మాట కోసం నీతి, నిజాయితీగా వ్యవహరించే సీఎం వైఎస్ జగన్‌కు మరోసారి అవకాశం ఇస్తారో నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈ నిర్ణయం పైనే ప్రజల భవిష్యత్తు, రాష్ట్ర ప్రగతి ఆధారపడి ఉంటాయనే విషయాన్ని ఆడపడుచులు విస్మరించరాదని విజ్ఞప్తి చేశారు. దీనికి అందరూ సానుకూలురైతే లేచి నిలబడి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఆశీస్సులు అందజేయాలని కోరగా.. సభకు వచ్చిన మహిళలందరూ అదేవిధంగా మద్దతు తెలిపారు.

రాష్ట్రంలో పేదరికం తగ్గింది

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో పేదరికం 12 శాతం ఉంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అది 6 శాతానికి తగ్గిందని తెలిపారు. రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలను మహిళలకే అందజేయడం పేదరికం తగ్గడానికి కారణమవుతోందని అన్నారు. ఈ విధానాలు ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పేదరికమే ఉండదనడంలో ఎటువంటి సందేహమూ లేదన్నారు. ప్రస్తుత పాలన కొనసాగాలంటే ప్రతి మహిళా, గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బేరీజు వేసుకోవాలని సూచించారు. నిరంతరం ప్రజా సంక్షేమం గురించి ఆలోచించే నేతలు ఒకవైపు, ఎన్నికల సమయంలోనే ముఖాలు చూపించే వారు మరోవైపు నిలుచున్నారని, ఈ తరుణంలో కుటుంబ బాగోగులను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఇంటింటికీ గోదావరి జలాలు

ఇంటింటికీ గోదావరి జలాలు అందిస్తామంటూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీని ఆచరణలోకి తీసుకువచ్చే విధంగా రూ.215 కోట్లతో అమలు చేసే వాటర్ గ్రిడ్ పథకానికి మంత్రులు వనిత, వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేశారు. సభలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పోతుల సునీత, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కాకినాడ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ, రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి కుటుంబంలోనూ అనేక మార్పులు వచ్చాయని అన్నారు. ఆ మార్పులు ఏవిధంగా వచ్చాయి, గత ప్రభుత్వాలు ఏవిధంగా వ్యవహరించాయో ఒక్కసారి బేరీజు వేసుకోవాలని కోరారు. అడగకుండానే అన్నీ అందిస్తున్న ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, అక్కడ జగనన్నకు, ఇక్కడ జక్కంపూడికి మద్దతు పలకాలని కోరారు. ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యం, కార్పొరేట్ చదువులు అందాలనే సంకల్పంతో వైఎస్సార్ బాటలోనే సీఎం జగన్ పయనిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను రూ.25 వేల కోట్ల మేర నాలుగు విడతల్లో మాఫీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణాన్ని ఓటు ద్వారా తీర్చుకునే అవకాశం త్వరలో వస్తోందని చెప్పారు.

మహిళా పక్షపాతి జగన్

రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ, మహిళలు బాగుంటే రాష్ట్రం, తద్వారా దేశం బాగుంటుందనే నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి సీఎం జగన్ అని అన్నారు. అందువల్లనే సంక్షేమ పథకాలను ఆడపడుచుల పేరిటే అమలు చేస్తూ, మహిళా పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మహిళలను ప్రగతికి సారథులుగా మలచాలనేది జగన్ ఆలోచన అయితే.. ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని, కరివేపాకులా పారేయాలనేది చంద్రబాబు నైజమని అన్నారు. మహిళా సాధికారతతో పాటు వారి రక్షణకు కూడా తమ ప్రభుత్వం దిశ వంటి చట్టాలను రూపొందించిందని గుర్తు చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోను వెబ్‌సైట్‌లో కూడా లేకుండా మాయం చేసిన దగాకోరు చంద్రబాబు అయితే.. తాను ఇచ్చిన హామీలను ఫొటోలా ఎదురుగానే పెట్టుకుని 99.5 శాతం వరకూ నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కుల, మతాలు, పార్టీల రంగులు చూడకుండా.. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలమన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు జలగల్లా ప్రజలను ఏవిధంగా పీడించాయో గుర్తు చేశారు. తన తండ్రి దివంగత జక్కంపూడి రామ్మోహనరావు హయాంలో మినహా ఆ తరువాత వచ్చిన ఎమ్మెల్యేలెవ్వరూ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాత రూ.1,152 కోట్లతో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. అలాగే ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,142 కోట్లు అందజేశామన్నారు. ఎమ్మెల్యేగా కాకుండా నిరంతరం మీ కుటుంబంలో ఒకడిగా పని చేస్తున్నానని, నియోజకవర్గంలోని ప్రజలకు ఎప్పుడు ఎటువంటి కష్టం వచ్చినా తమ కుటుంబం వెన్నంటి ఉంటుందని అన్నారు. మీ కుటుంబంలో ఒకనిగా మీ ఆశీస్సులు మరోసారి కోరుకుంటున్నానని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

గోదావరిలో పడి వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని రాజంపేటకు చెందిన మైలపల్లి గురుమూర్తి (35) ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోగల రాజంపేటకు చెందిన గురుమూర్తి శనివారం సాయంత్రం 6 గంటలకు గోదావరి ఒడ్డున మూత్ర విసర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తు గోదావరిలో పడిపోయాడని, అక్కడ ఉన్న కొంతమంది గురుమూర్తిని బయటకు తీయగా అప్పటికే మరణించాడన్నారు. మృతుని బావ సూరాడ అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. మృతునికి తల్లిదండ్రులు గౌరైమ్మ, పెద్దంకాలు, భార్య దానమ్మ, పన్నెండేళ్ల కుమార్తె నాగలక్ష్మి, ఎనిమిది నెలల పాప ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం – కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని సుమారు 30–35 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడని రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై మావుళ్లు ఆదివారం తెలిపారు. మృతుడు ఖాకీ రంగు షర్టు, షార్టును ధరించి ఉన్నాడన్నారు. మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మావుళ్లు తెలిపారు. మృతుని గురించి వివరాలు తెలిసిన వారు 08832442821, 9491003239 నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

శతాధిక వృద్ధురాలి మృతి


వరలక్ష్మి (ఫైల్)

అంబాజీపేట: పుల్లేటికుర్రుకు చెందిన శతాధిక వృద్ధురాలు గంగుమళ్ల వరలక్ష్మి (పిచ్చమ్మ) (101) ఆదివారం మృతి చెందారు. ఆమెకు అయిదుగురు సంతానం, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. తొమ్మిది మంది మనుమలు, మనుమరాండ్రు, 14 మంది ముని మనుమలు, మనమరాండ్రు ఉన్నారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: ఎద్దు గుద్దిన ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ తిలక్ వీధికి చెందిన కుంచెం రామభద్రరావు(85) ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. కాలి నడకన వెళ్లిన అతడిని రోడ్డుపై ఉన్న ఓ ఎద్దు బలంగా గుద్దింది. దీంతో రామభద్రరావు అక్కడే ఉన్న డ్రైనేజీలో పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో క్షతగాత్రుడు మృతి చెందాడు. ఘటనపై కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కడుపు కోత మిగిల్చిన ఈత

- కాలువలో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి
- రంప యర్రంపాలెంలో తీవ్ర విషాదం
- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు


లావేటి రామాంజీ ఇంటి వద్ద శోకసంద్రంలో కుటుంబ సభ్యులు


కాకర వీరవెంకట అర్జున్ (ఫైల్)


అన్నిబోయిన దేవీచరణ్ (ఫైల్)


లావేటి రామాంజీ (ఫైల్)

గోకవరం: కాలువలో సరదాగా ఈత కొడదామని వెళ్లిన ఆ విద్యార్థులు చివరకు తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారు. గోకవరం మండలం రంపయర్రంపాలేనికి చెందిన ముగ్గురు విద్యార్థులు మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి. వారంతా పదవ తరగతి విద్యార్థులు. చిన్నప్పటి నుంచి స్నేహితులు. స్నేహితుని జన్మదినం కావడంతో సరదాగా గడిపేందుకు రెండు బైక్‌లపై ఆదివారం ఐదుగురు విద్యార్థులు కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐ.పోలవరం వద్ద ఉన్న కాలువ వద్దకు విహారయాత్రకు వెళ్లారు. కాలువ లోతు తెలియని వారు ఈతకు దిగగా ముగ్గురు విద్యార్థులు దుర్మరణం చెందారు. గోకవరం మండలం రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కాకర వీరవెంకట అర్జున్(16), అన్నిబోయిన దేవీచరణ్(16), లావేటి రామాంజీ(అంజి)(16), మరో ఇద్దరు అండిబోయిన మోహన్, కుంచే వికాస్‌లతో కలిసి రెండు బైక్‌లపై అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐ.పోలవరం వద్ద సీతపల్లి వాగు వద్దకు విహారయాత్రకు వెళ్లారు. ఒడ్డున దుస్తులు విడిచి ఈతకు దిగిన ఐదుగురిలో వీరవెంకటఅర్జున్, దేవీచరణ్, రామాంజీ మృత్యువాత పడ్డారు.

ఉదయం 11 గంటల వరకు పాఠశాలలో..

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న వీరిలో రామాంజీ, మోహన్, వికాస్‌లు ఉదయం 11 గంటల వరకు పాఠశాలలో ఉన్నారు. అదనపు తరగతుల్లో భాగంగా ఎన్ఎస్ పరీక్ష రాశారు.

స్నేహితుని జన్మదినం కావడంతో ఇంటి వద్ద భోజనం

వీరిలో అండిబోయిన మోహన్ జన్మదినం కావడంతో మిత్రులంతా అతని ఇంట్లో భోజనం చేసి మధ్యాహ్నం 1 గంట వరకు సరదాగా ఆడిపాడారు. అనంతరం కేక్ తీసుకువస్తామని ఇంట్లో చెప్పి రెండు బైక్‌లపై బయలుదేరి వెళ్లిన వీరు కాలువలో ఈతకు దిగి కుటుంబ సభ్యులకు గర్భశోకం మిగిల్చారు.

చదువు, బ్యాడ్మింటన్‌లో మేటి

మృతులు ముగ్గురు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. మృతుల్లో కాకర వీరవెంకట అర్జున్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. అతని తండ్రి విష్ణు స్థానికంగా రేషన్ డీలర్‌గా పని చేస్తుండగా తల్లి గృహిణి, సోదరుడు ప్రదీప్ కాతేరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. అండిబోయిన దేవీచరణ్ సైతం చదువుతో పాటు బ్యాడ్మింటన్ ఆటలో రాణిస్తున్నాడు. అతని తండ్రి అప్పారావు కూలీ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. లావేటి రామాంజీ (అంజి) తండ్రి సత్తిబాబు సైతం కూలీ పని చేసుకుని కుమారుడిని చదివిస్తున్నాడు. రామాంజీ చెల్లి తులసి అదే పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. చదువులో బాగా రాణిస్తున్న వీరిని ఉన్నత చదువులు చదివించాలని కలలుకంటున్న వారి తల్లిదండ్రులకు తీవ్ర గర్భశోకం మిగిల్చారు.

శోక సంద్రంలో గ్రామస్తులు

ముగ్గురు విద్యార్థులు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న రంపయర్రంపాలెం గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, సహచర విద్యార్థులు సైతం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

చెరువులో పడి ఇద్దరు బాలురు మృతి


సరిపల్లిలో సందేశ్, చందు మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కొయ్యలగూడెం: తాత ఇంట్లో పుట్టిన రోజు వేడుకకు వచ్చిన ఇద్దరు బాలురు బహిర్భూమి కోసం వెళ్లి చెరువులో పడి దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో నివాసం ఉంటున్న కొత్రా గగన్ సందేశ్(16), అద్దేపల్లి చందు (12) ఈ నెల 10వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి కొయ్యలగూడెం మండలం సరిపల్లిలో ఉంటున్న తమ తాత ఇజ్రాయిల్ ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకకు హాజరయ్యారు. ఆదివారం ఉదయం సందేశ్, చందు బహిర్భూమికి వెళుతున్నామని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లారు. సాయంత్రం అయినా వీరు ఇంటికి చేరుకోకపోయే సరికి గ్రామస్తులతో కలిసి కుటుంబ సభ్యులు వారి కోసం వెతుకుతుండగా, సందేశ్, చందు వేసుకుని వెళ్లి బైక్ సరిపల్లి సమీపంలో ధర్మారావుపేట రోడ్డులో ఉన్న కోమటిగుంట చెరువు వద్ద గుర్తించారు. దీంతో చెరువు వద్ద వెతకగా మునిగిపోయిన బాలల చేతులు చెరువులో పైకి ఎత్తి ఉండడాన్ని గమనించారు. వెంటనే ఇద్దరిని బయటకు తీయగా, అప్పటికే వారు ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాల వద్ద తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. వేడుకలు జరుపుకొన్న ఇంట విషాదం నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సందేశ్ తండ్రి లాజర్, మేరీలకు ముగ్గురు కుమార్తెలు కాగా ఒక్కడే కుమారుడు. అదేవిధంగా చందు తండ్రి రాజేంద్ర, తల్లి లలితకు ఒక కుమార్తె కాగా, ఒక్కడే కొడుకు. రెండు కుటుంబాల వారు వేడుకలకు వచ్చి దుర్ఘటనపాలు అయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలుర మృతిపై సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించారు. కొయ్యలగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులపై కన్న తండ్రి అఘాయిత్యం


తీవ్రగాయాలతో బూడి సందీప్


తీవ్రగాయాలతో ఏడాదిన్నర చిన్నారి


స్వల్ప గాయాలతో సాయికుమార్

- భార్యపై కోపంతో పిల్లలపై పెట్రోలు పోసి అంటించిన వైనం
- తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు
- తండ్రికి స్వల్ప గాయాలు

రాజమహేంద్రవరం రూరల్: భార్యపై ఉన్న కోపంతో తను కంటికి రెప్పలా కాపాడాల్సిన కుమారుడు, కుమార్తెపై పెట్రోలు పోసి అంటించి తన పైశాచికత్వాన్ని చాటుకున్న తండ్రి ఉదంతం శాటిలైట్‌సిటీ గ్రామం రాజీవ్ గృహకల్ప సముదాయంలో శనివారం రాత్రి 10.30గంటల సమయంలో చోటు చేసుకుంది. చిన్నారుల ఇద్దరు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో తీవ్రగాయాలతోను, తండ్రి కూడా స్వల్పగాయాలతో చికిత్స పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం శాటిలైట్‌సిటీ రాజీవ్ గృహకల్ప సముదాయంలో జీ-5ప్లాట్ నంబరు 102లో బూడి సాయికుమార్ నివసిస్తున్నాడు. అతనికి ఐదేళ్ల క్రితం కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన బూడి దుర్గతో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల బూడి శివదుర్గాసందీప్, ఏడాదిన్నర పాప ఉంది. ఏడాదిన్నర క్రితం సాయికుమార్ భార్య పురిటి కోసం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి భర్త వద్దకు రాలేదు. గత 20రోజుల నుంచి సాయికుమార్ అత్తవారింటికి వెళ్లి భార్యతో గొడవ పడ్డాడు. నాలుగేళ్ల కుమారుడు సాయికుమార్ తల్లి శ్రీదేవి వద్దే ఉంటున్నాడు. ఏడాదిన్నర కుమార్తె భార్య దుర్గ వద్ద ఉంటోంది. సాయికుమార్ భార్య వద్ద ఉన్న ఏడాదిన్నర పాపను ఇంటికి తీసుకువచ్చి తల్లి వద్దే ఉంచాడు.

శనివారం రాత్రి తల్లి శ్రీదేవి వద్ద ఇద్దరు పిల్లలను సాయికుమార్ తన వద్ద పడుకోబెట్టుకుంటానని చెప్పి తీసుకువచ్చాడు. రాత్రి పదిగంటల సమయంలో సాయికుమార్ భార్యపై ఉన్న కోపంతో పిల్లలను కొట్టడంతో పాటు, ఏడాదిన్నరపాపను బాత్‌రూంలో పెట్టి పెట్రోలు పోసి అంటించడంతోపాటు, నాలుగేళ్ల సందీప్‌పైన పెట్రోలు పోసి అంటించాడు. ఈ సమయంలో సాయికుమార్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. పిల్లల అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆపి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో సందీప్, ఏడాదిన్నర కుమార్తె తీవ్రగాయాలతోను, తండ్రి సాయికుమార్ స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని బొమ్మూరు పోలీసులు, వీఆర్వో ఆర్.రత్నకుమారి పరిశీలించారు.

కన్న పిల్లలపై కనికరం లేదా...

భార్యతో గొడవపడి అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కన్నపిల్లలపై కర్కశంగా పెట్రోలు పోసి అంటించడంపై సాయికుమార్‌పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభంశుభం ఎరగని చిన్నారులపై పెట్రోలు పోసి అంటించడానికి చేతులు ఎలా వచ్చాయని మండిపడుతున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన సాయికుమార్‌ను కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇద్దరు యువకుల దుర్మరణం

- యర్రపోతవరం వద్ద రోడ్డు ప్రమాదం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లులు


ఘటనా స్థలిలో యువకుల మృతదేహాలు


పిల్లి ప్రసాద్


దుర్గాడి జాన్

కె.గంగవరం: యానాం–ద్రాక్షారామ రహదారిలో కె.గంగవరం మండలం యర్రపోతవరం లాకుల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిల్లి దుర్గాప్రసాద్(28), దుర్గాడి జాన్(26) మృతి చెందారు. ఎస్సై జానీ బాషా తెలిపిన వివరాల ప్రకారం అనపర్తి మండల లక్ష్మీనరసాపురానికి చెందిన పిల్లి దుర్గాప్రసాద్, దుర్గాడి జాన్ స్థానికంగా తాపీ పని చేసేవారు. వీరిద్దరికీ తండ్రులు లేకపోవడంతో ప్రసాద్ తల్లి నాగమణి, జాన్ తల్లి సీత వద్ద ఉంటున్నారు. వీరు కొడుకులు సంపాదించే రోజు వారీ ఆదాయంతోనే బతకాల్సిన పరిస్థితి ఉంది.

అయితే ఆదివారం ఉదయం దుర్గాప్రసాద్, జాన్ మోటారు సైకిల్‌పై యానాం వెళ్లి మధ్యాహ్నం తిరిగి సొంత గ్రామమైన లక్ష్మీనరసాపురం వస్తున్నారు. యర్రపోతవరం లాకుల వద్దకు వచ్చే సరికి ద్రాక్షారామ నుంచి యానాం వైపు వెళ్తున్న లారీని వీరు బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం సీఐ దొరరాజు, ఎస్సై జానీబాషా ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి బంధువులకు సమాచారం అందించారు. రెండు మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. అందరితో కలుపుగోలుగా ఉండే ప్రసాద్, జాన్ మృతితో స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ కుటుంబాలకు ఆధారమైన కొడుకులను కోల్పోవడంతో ఆ తల్లులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నేత్ర దానం


లక్ష్మీత్రివేణి

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీకి చెందిన ధూళిపూడి లక్ష్మీ త్రివేణి (58) ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ మేరకు సామాజిక కార్యకర్త లయన్ ధూళిపూడి వెంకట రమణ(బాబి) ఆమె కుటుంబ సభ్యులు భర్త రెడ్డినాయుడు, కుమారులు కన్నా, లోవ, రాజేష్‌లతో సంప్రదించి నేత్రదానానికి ఒప్పించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సిబ్బంది రవి, వీరేంద్రలు లక్ష్మీత్రివేణి కార్నియాలను సేకరించారు. నేత్రదానం చేయడం ద్వారా చూపులేని మరి కొంతమంది జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారని బాబి అన్నారు.